ప్రజాశక్తి

సోమవారం 13, ఫిబ్రవరి 2022

5

శ్రీ సత్యసాయి



ప్రజాసేవే రోటరీ క్లబ్ లక్ష్యం

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

పేద ప్రజలకు సేవ చేయడం రోటరీ క్లబ్ లక్ష్యమని క్లబ్ కార్యదర్శి రామకృష్ణ, కోశాధికారి జయసింహ, క్యాంప్ చైర్మన్ నరేంద్రరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని కోటా మున్సిపల్ పాఠశాలలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో బెంగుళూరుకు చెందిన శంకర కంటి ఆస్పత్రి, అనంతపురానికి చెందిన అంధత్వ నివారణ సంస్థ సహకారంతో ఉచిత కంటి ఆపరేషన్ల వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో కంటి వైద్యనిపుణులు ప్రియ, సౌందర్య 221 మందికి కంటి పరీక్షలు నిర్వహించి అందులో 121 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేసినట్టు క్లబ్ కార్యదర్శి తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ మాజీ అసిస్టెంట్ గవర్నర్ రత్నశేఖర్‌రెడ్డి, ఆర్గనైజర్లు ప్రసన్నకుమార్, శివయ్య, బివి. చలం, రమేశ్ బాబు, గట్టు హరినాథ్, సుదర్శన్ గుప్తా, మనోహర్, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు సురేష్ కుమార్

జిపిఎస్ తేవడం ఉద్యోగ, ఉపాధ్యాయులను మోసం చేయడమే

యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు సురేష్ కుమార్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రభుత్వం సిపిఎస్‌ను రద్దు చేయకపోగా జిపిఎస్ తేవడం ఉద్యోగ ఉపాధ్యాయులను మోసం చేయడమే అనియుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సురేష్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఉపాధ్యాయ భవనంలో యుటిఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశం గోవిందరాజులు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా యుటిఎఫ రాష్ట్ర సహాధ్యక్షులు సురేష్ కుమార్, సిఐటియు నాయకులు నాగేంద్ర కుమార్, పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా సురేష్ కుమార్ మాట్లాడుతూ.. పాధ్యాయుల సమస్యలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని అన్నారు. ఉపాధ్యాయులు చేస్తున్న పోరాటాలను రాష్ట్ర ప్రభుత్వం నిర్దాక్షిణ్యంగా అణచివేస్తోందన్నారు. విలీనం పేరుతో 40 వేల పాఠశాలలను 7500కు తగ్గించి వేస్తోందన్నారు. తద్వారా ఉపాధ్యాయుల సంఖ్య గణనీయంగా తగ్గిపోతోందని చెప్పారు. ఒకటి, రెండు తరగతులను అంగన్‌వాడీ కేంద్రాల్లో కలపడం వల్ల ప్రాథమిక పాఠశాల వ్యవస్థ కనుమరుగయ్యే పరిస్థితి తలెత్తిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సీబీఎస్ఈ సిలబస్ అమలు చేయడం వల్ల విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం ఆర్థిక పరమైన ప్రయోజనాలను, ఉద్యోగ ఉపాధ్యాయులు దాచుకున్న సొమ్మును కూడా ఇవ్వడంలేదని, సకాలంలో జీతాలు చెల్లించకుండా ఉందన్నారు. దీంతో వారు బ్యాంకుల్లో తీసుకున్న రుణాలపై అదనంగా రుసుము వసూలు చేస్తున్నారన్నారు. ఇది ఉద్యోగ ఉపాధ్యాయులకు ఆర్థిక నష్టమే కాకుండా వారి రేటింగ్ పడిపోతోందన్నారు. వర్క్ అడ్జస్ట్‌మెంట్‌ను యుటిఎఫ్ తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. సిఐటియు నాయకులు నాగేంద్ర మాట్లాడుతూ.. రాష్ట్రంలో విద్యారంగం ఎటు పోతుందో అర్థం కావడం లేదన్నారు. ప్రభుత్వం నాడు-నేడు పేరుతో పాఠశాలలను ఆధునీకరించి విలీనం పేరుతో మూసివేస్తోందన్నారు. దీనికి వ్యతిరేకంగా ఉద్యోగ ఉపాధ్యాయులు ప్రభుత్వాలపై మిలిటెంట్ పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు.వివిధ రకాల యాప్‌లతో ఉపాధ్యాయులను వేధిస్తోందన్నారు. దీనికి ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. ప్రభుత్వం నిరంకుశ వైఖరిని విడనాడకపోతే భవిష్యత్తులో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులను ఐక్యం చేసి పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. వెంటనే ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థికపరమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

యుటిఎఫ్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక

యుటిఎఫ్ జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా రమణయ్య, అధ్యక్షులుగా లింగమయ్య, సహాధ్యక్షులుగా రామప్ప, సరళ, కోశాధికారిగా రాఘవేంద్ర, కార్యదర్శులుగా ప్రమీల, అర్జున్, హనుమంతరెడ్డి, రాముడు, అబ్దుల్ వహాబ్ ఖాన్, సంజీవ్ కుమార్, రవి కుమార్, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా సుబ్బరాయుడు, మెంబర్లుగా వెంకట్రామిరెడ్డి, రాజేంద్ర, ఓబులేసు, చితప్ప, గంగాధర్, రాష్ట్ర కౌన్సిలర్‌గా పి. ఈశ్వరయ్య, దేవేంద్రమ్మ, సూర్యనారాయణ లను ఎన్నుకున్నారు.

యథేచ్ఛగా దళారుల దందా..!

స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో డాక్యుమెంట్ రైటర్ల దందా కొనసాగుతోంది. 2002 మేలో డాక్యుమెంట్ రైటర్ల వ్యవస్థను ప్రభుత్వం రద్దు చేసింది. అయినా..ఇప్పటికీ వారు లేనిదే ఏ ఒక్క డాక్యుమెంట్ కూడా సబ్ రిజిస్ట్రార్ టేబుల్‌పైకి చేరదు. రిజిస్ట్రేషన్ జరగదు. ఒక్కో రిజిస్ట్రేషన్‌కు ఒక్కో రేటు విధిస్తున్నారు. సబ్ రిజిస్ట్రార్లు.. స్టాంపు రైటర్ల మధ్య రహస్య ఒప్పందం వల్ల 'లో ఫీజు.. బయటి ఫీజు' పేరుతో అక్రమ వసూళ్లకు తెర తీశారు. ఒక డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్‌కు రూ.10 వేలకు పైగా అనధికారికంగా వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి

- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్టాంపు రైటర్ల ఇష్టారాజ్యం
- లో ఫీజు..బయటి ఫీజు పేరుతో దగా
- ప్రతి రిజిస్ట్రేషన్‌పై రూ.10 వేలకు పైగా అక్రమ వసూళ్లు



హిందూపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ప్రయివేటు వ్యక్తులు

ప్రజాశక్తి-హిందూపురం

స్థిరాస్తి క్రయవిక్రయాలు, దాన సెటిల్మెంట్లు (గిఫ్ట్‌డీడ్), వీలునామా, డాక్యుమెంట్ ఏదైనా రిజిస్ట్రేషన్ తప్పనిసరి. అనంతపురం జిల్లా పరిధిలో 13, శ్రీ సత్యసాయి జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలో 9 మొత్తం 22 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. ఒక్కో సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు పరిసరాల్లో అనధికారికంగా 25 నుంచి 50 మంది వరకు స్టాంపు రైటర్లు ఉన్నారు. వీరి ప్రమేయం లేనిదే 60 శాతం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్లు జరగడం లేదనే ఆరోపణలు లేకపోలేదు. ఏదైనా రిజిస్ట్రేషన్ చేయిస్తే స్టాంపు డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు కాదని.. అనధికారిక వసూళ్లకు దిగుతున్నారు.

లో ఫీజు.. బయటి ఫీజు..

ప్రభుత్వ సేవలు పొందితే ఒక రకమైన ఫీజే ఉంటుంది... లో ఫీజు.. బయటి ఫీజు ఏంటి..? అన్న అనుమానం రావడం సహజమే. జిల్లాలో కొన్ని సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులకు వెళ్లి స్థిరాస్తుల క్రయ విక్రయాల డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్ కోసం స్టాంపు రైటర్లను కలిస్తే.. లో ఫీజు.. బయట ఫీజు ఉంటుందని చెప్పేస్తున్నారు. బయటి ఫీజు అంటే స్టాంపు డ్యూటీ. ఇది చలానా రూపంలో ప్రభుత్వ ఖజానాకు వెళ్తుంది. లో ఫీజు అంటే.. రిజిస్ట్రేషన్ చేసినందుకు అనధికారికంగా ఇచ్చే మామూళ్లు. లో ఫీజు ఒక్కో సబ్ రిజిస్ట్రేషన్ ఆఫీసులో ఒక్కోరకంగా ఉంటోంది. స్థిరాస్తి రిజిస్ట్రేషన్ విలువను బట్టి కూడా ఇది మారుతుందని విశ్వసనీయ సమాచారం. అక్రమంగా వసూలు చేసే లో ఫీజు మొత్తంలో డాక్యుమెంట్ రైటర్ కొంత తీసుకొని మిగిలిన మొత్తాన్ని ఆఫీసులో ఇస్తున్నారని.. ఆ మొత్తంలో పనిచేసే ఉద్యోగుల స్థాయిని బట్టి వాటా పంపకాలు ఉంటాయన్న ఆరోపణలు ఉన్నాయి.

హిందూపురం సబ్ రిజిస్ట్రార్ పరిధిలో 20 మందికిపైగా స్టాంపు రైటర్లు ఉన్నట్లు తెలుస్తోంది. ఇద్దరు సబ్ రిజిస్ట్రార్ల పరిధిలో రోజుకు 50-80 వరకు డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయని అధికారులే చెబుతున్నారు. ఒక్కో డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్‌పై రూ.10 వేల వరకు లో ఫీజు, వివాదాస్పదమైన డాక్యుమెంట్లకైతే స్థిరాస్తి విలువను బట్టి రూ.లక్షల్లో వసూలు చేస్తున్నారనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. అధికారులకు పర్సెంటేజీ రూపంలో చెల్లించి.. మిగిలిన మొత్తాన్ని దళారులే కాజేస్తున్నారు. కొందరు స్టాంపు రైటర్లు రూ.కోట్లకు పడగలెత్తి.. తమ మాట వినకపోతే బదిలీ చేయిస్తామని అధికారులనే బ్లాక్ మెయిల్ చేస్తున్నారనే ఆరోపణలూ ఉన్నాయి.

పేరుకుపోయిన దళారి వ్యవస్థ..

హిందూపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో దళారీ అవతారమెత్తిన కొందరు డాక్యుమెంట్ రైటర్లు సూత్రధారులు కాగా, అధికారులు, సిబ్బంది పాత్రదారులుగా వ్యవహరిస్తున్నారు. ఏకంగా ప్రయివేటు వ్యక్తులు కార్యాలయంలో అధికారులుగా విధులు నిర్వహిస్తున్నారు. కార్యాలయానికి వచ్చిన క్రయ, విక్రయదారులు, రైతులు ఎవరినీ వీరు వదలడం లేదు. నిబంధనలతో సంబంధం లేకుండా పైసలిస్తే చాలు ఏపనైనా చేసిపెడతామనే ధీమాతో ముందుకెళ్తున్నారు. ఇక్కడి అధికారులు, సిబ్బందిని కాసులతో కొనేస్తున్నారు. రూ.వందల్లో పూర్తయ్యే పనికి వేలల్లో వసూలు చేస్తున్నారు. సాధారణ రిజిస్ట్రేషన్ల కంటే, నాలుగురాళ్లు ఎక్కువగా వచ్చే పనులపై శ్రద్ధ చూపుతున్నారు. ఈ క్రమంలో డీకేటీలు, అనధికార లేఅవుట్లు, నిషేధిత సర్వే నెంబర్లలోని వ్యవసాయ భూమి, ప్లాట్లను రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. ఇక్కడ కార్యాలయ పరిధిలో 20 మంది డాక్యుమెంటు రైటర్లు ఉంటే, అందులో సగం మంది దళారీలే. వీరే ఇక్కడి కార్యాలయంలో కీలకంగా మారారు. అధికారులతో ఏర్పరుచుకున్న ఒప్పందంతో ఎలాంటి డాక్యుమెంటునైనా రిజిస్ట్రేషన్ చేయిస్తున్నారు. భూమి, ప్లాటు విస్తీర్ణాన్ని బట్టి వసూలు చేస్తున్నారు. ఈ మొత్తంలో కార్యాలయంలో పాతిక శాతం ఇస్తున్నట్టు వినికిడి. అసైన్డ్, డీకేటీ, ప్రభుత్వ భూములు, అనధికార లేవుట్లు, చివరకు కోర్టు కేసులున్నా రిజిస్ట్రేషన్లు చేసేస్తున్నారు. ఇలాంటి వాటిని మొదట్లో పెండింగ్ నెంబర్ పెట్టడం, తర్వాత మరింత రేటు పెంచి రెగ్యులర్ నెంబర్ ఇస్తున్నారు. అలాగే రిజిస్ట్రేషన్లు కాని స్థలాలు, ప్లాట్లకు సమీపంలోని మరో సర్వే నెంబర్‌తో రిజిస్ట్రేషన్ చేయడం, తర్వాత సరవణ పేరుతో అక్రమాన్ని సక్రమం చేస్తున్నట్లు ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. ఇలా కొంతమంది రైటర్లు పెద్దమొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కొందరు రైటర్లు ముగ్గురు సహాయకులను నియమించుకుని అధికారులు, సిబ్బందిని బెదిరించడం, దౌర్జన్యాలకు పాల్పడుతున్న దాఖలాలు చాలానే ఉన్నాయి. కార్యాలయంలో సిబ్బంది కంటే వీరి పెత్తనమే అధికంగా ఉందంటే అతిశయోక్తి కాదు.

ప్రేక్షక పాత్ర వహిస్తున్న జిల్లా రిజిస్ట్రార్

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను ఎప్పటికప్పుడు తనిఖీలు చేసి అవినీతికి పాల్పడే అధికారులపై చర్యలు తీసుకోవాల్సిన జిల్లా రిజిస్ట్రేషన్ అధికారి ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు. నెలలో ఒక్క రోజు కూడా తనఖీ చేయడం లేదు. దీంతో హిందూపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న అధికారులది ఆడిందే ఆట..పాడిందే పాటగా మారింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు రిజిస్ట్రార్ కార్యాలయాల్లో తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోంటే ప్రభుత్వానికి భారీగా ఆదాయం రావడంతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయి.



మాట్లాడుతున్న మానవ హక్కుల వేదిక నాయకులు చంద్రశేఖర్

సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో మహాప్రస్థానం కవితా పఠనం

ప్రజాశక్తి-అనంతపురం

రెడ్ బుక్ డే సందర్భంగా సాహితీ స్రవంతి, ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల తెలుగు విభాగం సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక ఆర్ట్స్ కళాశాలలో మహాప్రస్థానం కవితా పఠనం కార్యక్రమం ఆదివారం జరిగింది. డాక్టర్ హేమమాలిని అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మానవ హక్కుల వేదిక నాయకులు చంద్రశేఖర్ రెడ్ బుక్ డే ప్రాధాన్యత గురించి మాట్లాడుతూ..18వ శతాబ్దంలో మొదలైన పుస్తకాల ప్రచురణ వివిధ దేశాలలో ఏ విధంగా విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చిందో వివరించారు. వివిధ ప్రజా ఉద్యమాలకు సాహిత్యం పుస్తకాలు అందజేసిన స్ఫూర్తి చాలా గొప్పదన్నారు. కమ్యూనిస్టు ప్రణాళిక ప్రచురితమైన ఫిబ్రవరి 21వ తేదీన రెడ్ బుక్ డే గా జరుపుకుంటున్నామన్నారు. అభ్యుదయ సాహిత్యాన్ని ప్రజలకు చేరవేయడానికి ఇది ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రముఖ కవి డాక్టర్ రాధేయ మాట్లాడుతూ శ్రీశ్రీ మహాప్రస్థానం తనకు ఏ విధంగా ప్రేరణనిచ్చిందో వివరించారు. కవిత్వం రాయటానికి, కవిత్వంలో ఉమ్మడిశెట్టి పురస్కారం నెలకొల్పటానికి శ్రీశ్రీ రాసిన 'నేను సైతం ప్రపంచానికి సమిధనొక్కటి ఆహుతిచ్చాను' వాక్యం స్ఫూర్తిగా నిలిచిందని తెలిపారు. సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షురాలు ప్రగతి మాట్లాడుతూ శ్రీశ్రీ మహాప్రస్థానం నుంచి స్ఫూర్తి పొందని కవులు దాదాపుగా ఎవరూ ఉండరని చెప్పారు. ఈనాటి తరానికి మహాప్రస్థానాన్ని పరిచయం చేయాల్సిన అవసరాన్ని సాహితీ స్రవంతి, ప్రజాశక్తి గుర్తించి విద్యార్థుల కోసం 'మహాప్రస్థానం చదువుదాం రండి' అనే కార్యక్రమాన్ని నిర్వహించినట్లుగా తెలిపారు. ఈ కవితా పఠనం కార్యక్రమంలో సాహితీ స్రవంతి నాయకులు ప్రజ్ఞా సురేష్, డాక్టర్ అంకె శ్రీనివాస్, యమున, స్పందన కవి చంద్రశేఖర శాస్త్రి, కథకుడు ఉప్పరపాటి వెంకటేశులు, మానవత తరిమెల అమర్నాథరెడ్డి, అనంత సాహితీ ప్రస్థానం అధ్యక్షుడు అశ్వర్థరెడ్డి, జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి సురేష్, బాల రంగయ్య, రామిరెడ్డి కసాపురం ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు. బేబీ వాక్య, మాస్టర్ కవనవిలాసి, డిగ్రీ విద్యార్థులు లావణ్య, ధనుష్ ఇంకా ఇతరులు మహాప్రస్థానంలోని కవితలను చదివి వినిపించారు.

నాణ్యమైన విద్యుత్ అందజేయడమే కర్తవ్యం

ఎపిఎస్‌పిడిసిఎల్ శ్రీ సత్యసాయి జిల్లా ఇన్‌ఛార్జి మోసెస్





ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

శ్రీ సత్యసాయి జిల్లా పరిధిలో రైతులకు, గృహ వినియోగదారులకు చిన్న, మధ్యతరగతి పరిశ్రమలకు, విద్యుత్ అంతరాయం కలగకుండా నాణ్యమైన విద్యుత్తును అందజేయడమే తమ కర్తవ్యమని ఆంధ్రప్రదేశ్ ఎస్‌పిడిసిఎల్ శ్రీ సత్యసాయి జిల్లా ఇన్‌ఛార్జి మోసెస్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన ప్రజాశక్తికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు ఆసక్తికర విషయాలను వెల్లడించారు. సత్యసాయి జిల్లా నూతనంగా ఏర్పడిన నాటి నుండి పుట్టపర్తి పట్టణంలోనూ, జిల్లా పరిధిలోనూ ఎలాంటి విద్యుత్ అంతరాయాలు జరగకుండా చర్యలు చేపడుతున్నామని తెలియజేశారు.

ప్రశ్న : శ్రీ సత్యసాయి జిల్లా పరిధిలో ఎన్ని వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. రైతులకు నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నారా?

జవాబు : ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా 2.60 లక్షల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఇటీవల 50 వేల మంది రైతులకు నూతన విద్యుత్ వ్యవసాయ కనెక్షన్లు ఇచ్చాం. డిసెంబర్ 31 వరకు కొత్తగా దరఖాస్తు చేసుకున్న ప్రతి రైతుకూ విద్యుత్ కనెక్షన్ అందించాం. ఇటీవల వ్యవసాయ కనెక్షన్లకు నూతన నియంత్రికలు ఏర్పాటు చేశాం. స్తంభాలు, నియంత్రికల కొరత వల్ల సత్వరమే రైతులందరికీ విద్యుత్ కనెక్షన్లు ఇవ్వలేకపోయాం. ఇకపై ఆలస్యం ఉండదు. కావలసిన రైతులు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.

ప్రశ్న : జిల్లాలో లోఓల్టేజ్ సమస్యతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దానిపై మీ అభిప్రాయం ?

జవాబు : ప్రస్తుతం కదిరి, హిందూపురం డివిజన్ పరిధిలో కొన్నిచోట్ల లోఓల్టేజ్ సమస్యతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. విద్యుత్ అవసరాలు ఎక్కువ కావడం ఎక్కువ పంటలు సాగులోకి రావడం వల్ల విద్యుత్ వాడకం ఎక్కువైందని. దానిని అధిగమించడానికి ప్రభుత్వం రైతులకు పగటిపూటే 9 గంటలు నాణ్యమైన విద్యుత్తు ఇవ్వడానికి అన్ని చర్యలూ తీసుకుంటోంది. ఇందులో భాగంగా పులివెందుల నుండి కదిరికి 130 కెవి కేబుల్‌ను, కడప నుండి ముత్యాలచెరువు సబ్‌స్టేషన్ వరకు 220 కెవి కేబుల్‌ను ఏర్పాటు చేస్తున్నారు. వీటి పనులు పది రోజుల్లో పూర్తి అవుతాయి. రైతులకు లోఓల్టేజ్ సమస్య ఉండదు. నాణ్యమైన విద్యుత్తు అందుతుంది.

ప్రశ్న : జిల్లా వ్యాప్తంగా నూతన సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నారా.?

జవాబు : జిల్లా వ్యాప్తంగా పెరిగిన విద్యుత్ వాడకాన్ని దృష్టిలో ఉంచుకుని కదిరి, హిందూపురం డివిజన్లలో కొత్త సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నాం. ఇందులో భాగంగా కదిరి డివిజన్‌లో జోకుల, నల్లమాడ, దొరిగల్లు, మంగళమడక, చెర్లోపల్లి, జగరాజుపల్లి, ప్రశాంతి నిలయం వెస్ట్ గేట్, కోట కమ్మవారిపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్నాం. సబ్‌స్టేషన్ల ఏర్పాటు ద్వారా సత్యసాయి జిల్లాలో రైతులకు నాణ్యమైన విద్యుత్తును అందిస్తాం.

ప్రశ్న : వేసవిలో విద్యుత్ కొరతను ఏ విధంగా అధిగమిస్తున్నారు.?


జవాబు : వేసవిలో విద్యుత్ కొరతను అధిగమించడానికి పలు చర్యలు తీసుకుంటున్నాం. రైతులు వేసిన పంటలకు గృహ లబ్ధిదారులకు ఎలాంటి అంతరాయం లేకుండా గతంలో కంటే అత్యధికంగా విద్యుత్తు వినియోగాలు ఉంటాయి. అందుచేత ముందస్తుగానే ఎంత విద్యుత్ అవసరమో దానికంటే రెట్టింపు విద్యుత్తు సరఫరా అయ్యేవిధంగా చర్యలు చేపడతాం. గ్రామంలో సైతం ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడం వల్ల ఎక్కడ లోఓల్టేజి సమస్య వచ్చినా పంటలు ఎండిపోకుండా చర్యలు చేపడతాం. నాణ్యమైన విద్యుత్తు అందిస్తాం.

ప్రశ్న : విద్యుత్ ప్రమాదాలు జరగకుండా చర్యలు ఏమైనా చేపడుతున్నారా?

జవాబు : విద్యుత్ ప్రమాదాలు యాదృశ్చికంగా జరుగుతాయి. ఎవరూ ప్రమాదాలు కొనితెచ్చుకోరు. అజాగ్రత్తల వల్ల, కొన్నిసార్లు అనుకోని సంఘటనలు జరిగినప్పుడు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు విద్యుత్ ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాద తీవ్రతను బట్టి వారికి పరిహారం అందజేస్తాం. ఇప్పటివరకు అలా మృతి చెందిన వారికి ఆర్థిక సాయం అందింది. ఇంకా కొంతమందికి అందజేయాల్సి ఉంది.

జాతీయ స్థాయి కరాటే పోటీలలో కదిరి విద్యార్థుల ప్రతిభ

కదిరి టౌన్ : కర్నాటక రాష్ట్రం చిక్‌బల్లాపూర్ జిల్లా గౌరిబిదనూర్ లో జరిగిన జాతీయస్థాయి కరాటే పోటీలలో కదిరి విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు మాస్టర్ షాకీర్ తెలిపారు. గౌరిబిదనూరు లో జరిగిన 9వ జాతీయ స్థాయి కరాటే ఛాంపియన్‌షిప్ పోటీలు షిటోరియో కరాటే డో ఇండియా అకాడమీ, అఖిల కర్నాటక స్పోర్ట్స్ కరాటే డో అసోసియేషన్ మాస్టర్ క్యోషి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించారని చెప్పారు. ఈ పోటీలలో కదిరి విద్యార్థులు నలుగురు కటా విభాగంలో పాల్గొని మొదటి స్థానాన్ని కైవసం చేసుకున్నారన్నారు. ఈసందర్భంగా మాస్టర్ షాకిర్‌ను సత్కరించారు.



స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాలను పరిశీలిస్తున్న ఇసిఇ సభ్యులు పూల శ్రీనివాసరెడ్డి

మహనీయుల ఫొటో ప్రదర్శన అభినందనీయం

ప్రజాశక్తి - కదిరి టౌన్

మహనీయుల ఫోటోల ప్రదర్శనలు అభినందనీయమని సీఈసీ సభ్యులు పూల శ్రీనివాసరెడ్డి అన్నారు. కదిరి ప్రముఖ చరిత్ర కారులు శ్రీ సయ్యద్ నసిర్ అహ్మద్ రూపొందించిన చరితార్థుల ఆల్బమ్‌ను జమాతే ఇస్లామి హింద్ , ఆధ్వర్యంలో మున్సిపల్ ఉర్దూ స్కూల్ లో ఏర్పాటు చేసిన ఫోటో గ్యాలరీనీ వైసిపి రాష్ట్ర సిఇసి సభ్యులు పూల శ్రీనివాసులు రెడ్డి, వైసిపి కదిరి పట్టణ అధ్యక్షులు కె ఎస్ బాహుద్దీన్, వైసిపి రాష్ట్ర లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి లింగాల లోకేశ్వర్ రెడ్డి తిలకించారు. ఈ కార్యక్రమంలో జమాతే ఇస్లామి హింద్ కదిరి ప్రతినిధులు డాక్టర్ ఆర్షద్, ఉమ్మర్ ఖాద్రీ, తలుపుల మండల కన్వీనర్ శంకర్, నాయకులు ఆత్మ రెడ్డి,ఉత్త రెడ్డి, మల్లి నాయుడు, ముబారక్, పవనకుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్డియాలజీ కోర్సులో గ్రామీణ విద్యార్థిని ప్రతిభ

ప్రజాశక్తి - బుక్కపట్నం



ప్రతిభా విద్యార్థిని గజలక్ష్మికి స్వీట్ తినిపిస్తున్న దృశ్యం

కార్డియాలజీ కోర్స్‌లో గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థిని గజలక్ష్మి అత్యున్నత ప్రతిభ కనబరిచి మొదటి స్థానంలో నిలిచి తన ప్రత్యేకతను చాటుకుంది. మండల పరిధిలోని జానకంపల్లికి చెందిన నాగార్జున శాంతమ్మ దంపతుల కుమార్తె గజలక్ష్మి సత్య సాయి ఇన్స్టిట్యూట్ ఆఫ్ కార్డియాలజీ అండ్ టెక్నాలజీ బెంగళూరు కళాశాలలో బీఎస్సీ కార్డియాకేర్ టెక్నాలజీ విద్యను అభ్యసిస్తోంది. 2023 సంవత్సరంలో నిర్వహించిన పరీక్షలలో ప్రథమ స్థానం సాధించి పలువురు విద్యార్థులకు ఆదర్శంగా నిలిచింది. ఈ సందర్భంగా విద్యార్థిని మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు సాయిబాబా స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు కొనసాగిస్తానని తెలిపారు.

టూరిజం పోలీస్ అవుట్‌పోస్టు పరిశీలన

ప్రజాశక్తి - లేపాక్షి

మండల కేంద్రం లోని స్థానిక నంది విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన టూరిజం పోలీసు అవుట్ పోస్టును ఎస్పీ రాహుల్ దేవ్‌సింగ్ ఆదివారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ యస్వంత్, సిఐ వేణుగోపాల్, ఎస్ఐ మునీర్ అహమ్మద్ సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ బియ్యం కోసం ఇక్కట్లు

ప్రజాశక్తి - కొత్తచెరువు

రేషన్ బియ్యం కోసం కార్డుదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాహనాలను ఏర్పాటు చేసి ఈపాస్ మిషన్ల ద్వారా లబ్ధిదారులతో వేలిముద్రలు సేకరించి వారి ఇంటి వద్దకే రేషన్‌ను పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. కొత్తచెరువు మండలంలో ఈ పంపిణీ కార్యక్రమం ఆశించినస్థాయిలో జరగలేదు. కొత్తచెరువు, గోరంట్ల పల్లి, బండపల్లి గ్రామాలలో ఇంటివద్దకే రేషన్ పంపిణీని చేపట్టారు. అయితే కొన్ని రోజులు మాత్రమే లబ్ధిదారులకు రేషన్‌ను పంపిణీ చేశారు. కార్డుదారులకు సకాలంలో రేషన్ అందించలేక వారు ఆ విధులనుండి తప్పుకున్నారు. అప్పటినుండి చౌక ధాన్యపు డీలర్ల ద్వారా కార్డుదారులకు రేషన్ పంపిణీ చేస్తున్నారు. రేషన్ షాపుల వద్ద కార్డుదారులు రేషన్ కోసం పడిగాపులు కాస్తున్నారు. రేషన్ డీలర్లు తూకాలు కూడా సక్రమంగా ఇవ్వలేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఇంటింటికి రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని ఆయా గ్రామాల కార్డుదారులు కోరుతున్నారు.

ఆస్టిన్ నగర తెలుగు కల్చరల్ అసోషియేషన్ అధ్యక్షుడిగా ప్రవాసాంధ్రుడు

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

అమెరికా దేశంలోని ఆస్టిన్ నగర తెలుగు కల్చరల్ అసోషియేషన్ అధ్యక్షుడిగా సత్యసాయి జిల్లాకు చెందిన నంగి పరమేశ్వరరెడ్డి ఎంపికైనట్లు ఆత్మీయ ట్రస్టు చైర్మన్ తెల్లిపి జయచంద్రారెడ్డి, వైస్‌చైర్మన్ సూర్యప్రకాశ్ రెడ్డి తెలిపారు. శనివారం అమెరికాలోని ఆస్టిన్ నగర తెలుగు కల్చరల్ అసోషియేషన్ ఎన్నికలలో ఆమెరికాలో స్థిరపడిన ప్రవాసాంధ్రుడు నంగిపరమేశ్వరరెడ్డి తన సమీప ప్రత్యర్థి రవిపై 22 ఓట్ల మెజారిటీతో గెలుపొందినట్లు వారు తెలిపారు. దీంతో ధర్మవరానికి చెందిన ఆత్మీయట్రస్టు చైర్మన్ తెల్లిపి జయచంద్రారెడ్డి, వైస్‌చైర్మన్ సూర్యప్రకాష్‌రెడ్డి, డైరెక్టర్ రాజశేఖర్లు సంగిపరమేష్‌రెడ్డిని అభినందించారు. నంగి పరమేశ్వరరెడ్డి కదిరి ప్రాంతం తలుపుల మండలం సంగిగానదొడ్డిపల్లి గ్రామానికి చెందినవాడని వారు చెప్పారు. ఈయన 15ఏళ్ల క్రితం ధర్మవరానికి వలస వచ్చి పదేళ్ల క్రితం అమెరికాకు వెళ్లి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ స్థిరపడ్డాడని తెలిపారు.



నంగి పరమేశ్వరరెడ్డి

దేశ సమగ్రతకు మహనీయుల కృషి ఆదర్శనీయం

ప్రజాశక్తి కదిరి టౌన్

దేశ సమగ్రత సమైక్యత, సమగ్రత కోసం మహనీయుల కృషి ఆదర్శనీయమనిసయ్యద్ నజీర్ అహ్మద్ పేర్కొన్నారు. స్థానిక మున్సిపల్ ఉర్దూ పాఠశాలలో ముస్లిం స్వతంత్ర సమరయోధుల చిత్రపట దర్శనకు హాజరైన ప్రధాన చరిత్రకారులు సయ్యద్ నజీర్ అహ్మద్‌ను మెప్మా ఆధ్వర్యంలో ఈ సందర్భంగా సన్మానించారు. దేశ సమగ్రత సమైక్యత కోసం విశేష కృషి చేస్తున్న సయ్యద్ నజీర్ అహ్మద్ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జంషీద్, మహమ్మద్ అలీ, లెక్చరర్ సాలెహ , మెప్మా అధ్యక్షులు రాయల్ జిలాన్ , సెక్రటరీ మహమ్మద్ అలీ, అసోసియేట్ అధ్యక్షులు అత్తార్ మహబూబ్ బాషా , కౌన్సిలర్లు నాసిర్, దాదా పీర్, కాజా మొహిదీన్, గౌసలాజం, మౌలాలి, చిత్తూర్ మెప్మా సభ్యులు ఆదిల్, పర్వేజ్ తదితరులు పాల్గొన్నారు

ముగిసిన విగ్రహ ప్రతిష్టాపన ఉత్సవాలు

ధర్మవరం టౌన్ : పట్టణంలోని దుర్గానగర్‌లో శీతలాదేవి రామలింగేశ్వరస్వామి విగ్రహప్రతిష్టాపన ఉత్సవాలు ఆదివారం ముగిశాయి. ఐదు రోజులుగా ఆలయ అభివృద్ధి కమిటి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం వినాయకుడు, శివుడు, పార్వతీదేవి, కాలభైరవి, సుబ్రమణ్యస్వామి, శీతలాదేవి, ఆదిత్యాది నవగ్రహాలను ప్రతిష్టించారు. ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్,జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలక మధుసూదన్ రెడ్డి తదితరులు ఈసందర్భంగా ప్రత్యేక పూజలు చేయించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు సాకేచిన్నిక్రిష్ణ, బెస్తరామకృష్ణ, రామాంజినేయులు, లక్ష్మీనారాయణ, రాము, పెద్దపోతలయ్య, వార్డు కౌన్సిలర్ కోటిరెడ్డి సుజాత, కోటిరెడ్డి బాలిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



డీలర్ భార్యకు ఆర్థికసాయం అందజేస్తున్న ధర్మవరం స్టోర్ డీలర్లు

బాధితుడికి ఆర్థికసాయం

ధర్మవరం టౌన్ : పట్టణానికి చెందిన స్టోర్ డీలర్, కేతిరెడ్డి అభిమాని దేవరకొండ రమేశ్ గత కొంతకాలంగా ఆనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న స్టోర్ డీలర్ల సంఘం రాష్ట్ర జాయింట్ సెక్రటరీ పరంధామరెడ్డి, డీలర్లు అజంతకిష్ణ, రంజిత్, బైముతక రమణ, బెస్త వెంకటరమణ, అంగజాల నరేశ్, మోటుమర్ల రమణ, చిన్నూరు ప్రసాద్ అనంతపురంలోని సవేరా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న డీలర్ దేవరకొండ రమేశ్‌ను ఆదివారం పరామర్శించారు. వైద్య చికిత్సల నిమిత్తం రూ.20 వేలు అందజేశారు.

గ్రంథాలయానికి పుస్తకాలు వితరణ

రొద్దం : గ్రంథాలయానికి పాతకాలం నాటి పుస్తకాలను శనివారం అందజేశారు. ఈ మేరకు దాతలు గ్రంథాలయ అధికారి నాగరాజుకు 15పుస్తకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగభూషణం, బాలకృష్ణ, ప్రసాద్, అశోక్, లోకేష్, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షులుగా ఎస్ఆర్.ఆంజనేయులు

పుట్టపర్తి రూరల్ : ఆమ్ ఆద్మీ పార్టీ శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షుడుగా న్యాయవాది ఎస్ఆర్. ఆంజనేయులును ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు ఆ పార్టీ రాయలసీమ ఇన్‌ఛార్జి బివి సుబ్బారెడ్డి ప్రకటించారు. ఆదివారం పుట్టపర్తిలోని శ్రీ సాయి ప్రశాంత్ కళ్యాణ మండలంలో ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు, కార్యకర్తలు సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆమ్ ఆద్మీ పార్టీ సత్యసాయి జిల్లా నూతన కమిటీని ఎంపిక చేశారు. జిల్లా అధ్యక్షులుగా న్యాయవాది ఎస్ఆర్ ఆంజనేయులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే జిల్లా ప్రధాన కార్యదర్శిగా మంజుల శ్రీనివాసులును ఎంపిక చేశారు. ఈ సందర్భంగా రాయలసీమ ఇన్‌ఛార్జి బివి. సుబ్బారెడ్డి మాట్లాడుతూ రాబోయే 2024 ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ ఆంధ్రప్రదేశ్ లో బలోపేతం చేయడంతో పాటు రాబోయే ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ తరుపున ఎన్నికల్లో పోటీ సంసిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఆర్ ఆంజనేయులు మాట్లాడుతూ తనపై పార్టీ ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుధాకర్, మహేష్, దండు నాగరాజు, బాల, సోము శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల వద్ద పాల పొంగులు

బత్తలపల్లి : మాఘ మాసం దీక్షలు చేపట్టిన పలువురు మహిళలు నాల్గవ ఆదివారం ఆలయాల వద్ద భక్తిశ్రద్ధలతో పాల పొంగులు నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజామునే దేవాలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని సంజీవపురం కాటికోటేశ్వరక్షేత్రం, సంఘమేశ్వర క్షేత్రం, మాల్యవంతం, రామాపురం, కోడేకండ్లలోని వీరనారాయణస్వామి, డి. చెర్లోపల్లి సిద్ధేశ్వరాలయం, దంపెట్ల చెన్నకేశవాలయం, ముష్టూరు, పోట్లమర్రి శివాలయంలోనూ, గంటాపురం అప్పస్వామి దేవాలయంలోనూ పాల పొంగులు నిర్వహించారు.

నేడు 'స్పందన' రద్దు

పుట్టపర్తి అర్బన్ : కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమం రద్దు చేసినట్లు కలెక్టరేట్ అధికారులు తెలిపారు. ఈ మేరకు ఆదివారం కలెక్టరేట్ నుంచి ఒక ప్రకటన విడుదల అయింది. పాలనాపరంగా వ్యవహారాలు ఉన్నందున అనివార్య కారణాలవల్ల ఈ కార్యక్రమం రద్దు చేసినట్లు అధికారులు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

15న మండల మీట్

గాండ్లపెంట : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ తాతం జగన్మోహన్ అధ్యక్షతన ఈనెల 15న మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో డి. అంజనప్ప తెలిపారు ఈ సమావేశానికి ఎంపిటిసిలు, సర్పంచులు, ఆయా శాఖల అధికారులు, సభ్యులు హాజరుకావాలని ఆయన కోరారు.

రజక సంఘం మండల కమిటీ ఏర్పాటు

లేపాక్షి : మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన రజకులు సమావేశంలో మండల రజకసంఘం కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులు గా బయన్నపల్లి గ్రామానికి చెందిన రవిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా శంకరప్ప, ఈశ్వరప్ప, బాలాజీ రామాంజినేయులును ఏక గ్రీవంగా ఎన్నుకొన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని రజకులు పాల్గొన్నారు.

104 సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

అనంతపురం కలెక్టరేట్ : 104 ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ జిల్లా జెఎసి కన్వీనర్ ఎజి.రాజమోహన్, జిల్లా ఛైర్మన్ కె.విజయ్ డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో 104 ఉద్యోగుల జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 104 ఉద్యోగులు సుమారు 20ఏళ్లుగా పని చేస్తున్నా కనీస వేతనాలు ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. వెంటనే వీరిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎస్.రమేష్, ప్రధాన కార్యదర్శిగా సుబ్రహ్మణ్యం, కోశాధికారిగా పి.కిషోర్‌బాబు, ఉపాధ్యక్షులుగా తిప్పేరుద్ర, డికె.మల్లికార్జున, సహాయ కార్యదర్శులుగా సురేష్, శ్రీపతి, రామకృష్ణను ఎన్నుకున్నారు.

ఖురాన్ కంఠస్థ పోటీల్లో ధర్మవరం విద్యార్థికి మొదటి బహుమతి

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

విజయవాడలో ఎటిఎల్ హాల్‌లో యునైటెడ్ ఫోరం ఫర్ కురానిక్ కంఠస్థ ప్రతిభ రాష్ట్ర పోటీల్లో ధర్మవరం విద్యార్థి ప్రతిభ కనపర్చాడు. ఈ పోటీల్లో బి -గ్రూపులో ధర్మవరం పట్టణానికి చెందిన మహమ్మద్ రైహాన్ మొదటి బహుమతి సాధించాడు. పట్టణంలోని లోనికోటకు చెందిన ఇర్ఫాన్‌బాషా, తస్లీమ్ కుమారుడు మహమ్మద్ రైహాన్ మున్సిపల్ ఉర్దూస్కూల్లో 2వ తరగతి చదువుతున్నాడు. ఈ విద్యార్థి విజయవాడలో నిర్వహించిన కంఠస్థ పోటీల్లో ప్రతిభ కనబరిచారు. దీంతో ఏపీ రాష్ట్ర -మైనార్టీ కమిషనర్ చైర్మన్ ఇక్బాల్ అహ్మద్ చేతులమీదుగా మెమొంటోను అందుకున్నారు. దీంతో పాఠశాల హెచ్‌ఎం ఇర్ఫాన్ అలీతో పాటు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థిని అభినందించారు.



ఇక్బాల్ అహ్మద్ చేతులమీదుగా బహుమతిని అందుకుంటున్న ధర్మవరం విద్యార్థి

వన్యప్రాణులను కాపాడండి

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

అడవులకు నిప్పు పెట్టడం వల్ల లక్షలాది వన్యప్రాణులు, జీవరాసులు అగ్నికి ఆహుతి అవుతున్నాయని పర్యావరణాన్ని పరిరక్షించడంలో ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ ఇండియన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పర్యావరణవేత్త, జంతుప్రేమికుడు డాక్టర్ భాస్కర్ నాయుడు పిలుపునిచ్చాడు. ఆదివారం ఆయన కేంద్ర పర్యావరణ సంరక్షణ అధికారికి లేఖ రాశాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన శ్రీ సత్య సాయి పేరు మీద ఏర్పడిన జిల్లాలో అడవులకు నిప్పు పెట్టడం వల్ల లక్షలాది జంతువులు, జీవరాసులు కాలి మసి అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చే మార్చి నెల నుంచి వేసవి ప్రారంభం అవుతుందని ఇప్పటినుంచే జిల్లా కలెక్టర్, ఫారెస్ట్ అధికారులు, అడవులను కాపాడడానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలని కోరారు. కళ్లెదుటే అడువులు నాశనం అవుతున్నాయని అందులో ఉన్న జీవరాసులు, మనిషి ప్రాణాలను కాపాడే ఔషధాలు వనమూలికలు ఖాళీ బూడదవుతున్నాయన్నారు. ఈ విషయంపై నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న అటవీ శాఖ అధికారులకు తగిన మార్గ నిర్దేశం చేయాలని, దేశ వన్యప్రాణుల సంఘం సంరక్షణ అధికారికి లేఖలో వివరించామని ఆయన ఈసందర్భంగా తెలిపారు.



డాక్టర్ భాస్కర్‌నాయుడు

గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

ప్రజాశక్తి - మడకశిర రూరల్

గ్రామీణ క్రీడల అభివృద్ధికి తమవంతు పూర్తి సహకారం అందిస్తామని మడకశిర ఎమ్మెల్యే తిప్పేస్వామి, పెనుకొండ ఎమ్మెల్యే శంకరనారాయణ పేర్కొన్నారు. మండల పరిధిలోని సి. కొడిగేపల్లిలో కాపు సురేష్ రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్ఆర్ టీ -10 జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ఆదివారం ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకొన్నారు. సి. కొడిగేపల్లి సర్పంచి కవిత అధ్యక్షతన ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే శంకర్ నారాయణ మాట్లాడుతూ గ్రామీణ క్రీడల పట్ల యువతను మరింతగా ప్రోత్సహించడానికి క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్న కాపు సురేష్ రెడ్డిని అభినందిస్తున్నామన్నారు. మడకశిర ఎమ్మెల్యే తిప్పేస్వామి మాట్లాడుతూ గ్రామీణ క్రీడల పట్ల యువతను మరింతగా ప్రోత్సహించడానికి తన వంతు కృషి చేస్తామన్నారు. టోర్నీ నిర్వాహకులు ఈసందర్భంగా ఎమ్మెల్యేలను ఘనంగా సన్మానించారు. మొదటి రోజు జరిగిన మ్యాచ్లో పరిగి జట్టుపై మడకశిర మండలం చందకచెర్ల జట్టు గెలుపొందింది. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కవిత సత్యనారాయణ, జెడ్పీటీసీ సరోజమ్మ, సింగల్ విండో అధ్యక్షులు రామిరెడ్డి, మాజీ ఎంపీపీ బజ్జప్ప, జమ్మానపల్లి మూర్తి, సర్పంచులు, ఎంపీటీసీలు, కన్వీనర్లు, మడకశిర, పెనుకొండ మండలాల నాయకులు, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకే విమర్శలు

అనంతపురం కలెక్టరేట్ : అభివృద్ధిని చూసి ఓర్వలేకే ప్రతిపక్ష నాయకులు లేనిపోని విమర్శలు చేస్తున్నారని ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చామలూరు రాజగోపాల్, జడ్పీ ఛైర్‌పర్సన్ వేదాంతం నాగరత్నమ్మ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని సొసైటీ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి శింగనమల నియోజకవర్గ చరిత్రలో గతంలో ఏ ప్రభుత్వాలు చేయని అభివృద్ధి పనులు చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వాల హయాంలో జరిగిన అభివృద్ధి, వైసిపి హయాంలో జరిగిన అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. నార్పల కూతలేరు వంతెన నిర్మాణానికి మాజీమంత్రి శైలజానాథ్ ఒకసారి, మాజీ ఎమ్మెల్యే యామినీబాల రెండుసార్లు భూమిపూజ చేసి వదిలేశారన్నారు. అదే ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి పాలనలో బ్రిడ్జి నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. ఇలాంటి అభివృద్ధి పనులను చూసి ఓర్వలేకే ప్రతిపక్ష నేతలు విమర్శలు చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా ప్రతిపక్ష నాయకులు లేనిపోని విమర్శలు మానుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో దుర్గం సర్పంచి రామాంజనేయులు, వైసిపి ఎస్సీ సెల్ అధ్యక్షులు వరికూటి కాటమయ్య, తదితరులు పాల్గొన్నారు.

'ఆశా'లతో స్వీపర్ల పనులు చేయించడం బాధాకరం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఆశావర్కర్లతో స్వీపర్లు చేసే పనులను చేయించడం బాధాకరమని ఆశావర్కర్ల యూనియన్ జిల్లా కమిటీ నాయకులు అన్నారు. గ్రామాల్లో ఆశావర్కర్లు అనేక సేవలు చేస్తున్నారన్నారు. ముఖ్యంగా సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించడంతోపాటు మాతా, శిశ సంరక్షణ కోసం ఎనలేని కృషి చేస్తున్నారన్నారు. ఆశావర్కర్లతో చేయాల్సిన పని కాకుండా అనేక రకాల అదనపు పనులు చేయించడం బాధాకరమన్నారు. ముఖ్యంగా గార్లదిన్నె, శ్రీరంగాపురం, ఆవులదట్ల పిహెచ్‌సిల్లో ఎక్కువగా పనులు చేయిస్తున్నారన్నారు. మూడు రోజుల క్రితం రాప్తాడు పిహెచ్‌సి మైదానాన్ని ఆశా వర్కర్లే శుభ్రం చేయించారన్నారు. ఆశావర్కర్లపై స్వీపర్ పనులు చేయిస్తున్న మెడికల్ ఆఫీసర్లు, యుడిసిలపై వెంటనే చర్యలు తీసుకోవాలి, లేనిపక్షంలో పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో యూనియన్ నాయకులు మాలతి, భారతి, సుజాత, వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

గోరంట్ల : పట్టణంలోని ఎస్‌ఎపిఎస్ జూనియర్ కళాశాలలో 1992 - 94 సంవత్సరంలో ఇంటర్మీడియట్ చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం స్థానిక కెంపుల ఫంక్షన్ హాల్‌లో సమావేశమయ్యారు. 30 సంవత్సరాల తరువాత స్నేహితులంతా కలసి అప్పటి తమ జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అప్పటి గురువులైన ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ, అధ్యాపకులు రామాంజనేయులు, సూర్యనారాయణ, రామాంజనేయులు, రమణారెడ్డి, రమేష్‌ను పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

పుట్టపర్తి రూరల్ : మండల పరిధిలోని పెడపల్లి ఉన్నత పాఠశాలలో 1987లో పదవ తరగతి చదివిన విద్యార్థుల అపూర్వ కలయిక ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా అప్పటి తమ జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. 35 ఏళ్ల తర్వాత స్నేహితులంతా తమ కుటుంబసభ్యులతో కలసి సాయంత్రం దాకా సందడి చేశారు. అలనాటి గురువులైన ప్రస్తుత ప్రధానోపాధ్యాయుడు రామచంద్రారెడ్డి, ముద్దు శంకరప్ప, అత్తర్ బాష, వెంకటాచలపతి, రామకృష్ణ సుబ్రహ్మణ్యం తదితరులకు జ్ఞాపికలు అందజేసి ఘనంగా సత్కరించారు.





గోరంట్ల, పుట్టపర్తి మండలాల్లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

లేపాక్షి : మండలం పరిధిలోని బిసలమానేపల్లికి చెందిన దినేష్ (25) అనే యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. అందుకు సంబంధించిన వివరాలు దినేష్ స్థానిక టెనమ్ ఫ్యాక్టరీ లో కార్మికుడుగా పనిచేస్తున్నాడు. ఆదివారం పని ముగించుకొని సొంత గ్రామం బిసలమానేపల్లికి ద్విచక్రవాహనంలో బయలు దేరాడు. మార్గమధ్యంలో జాతీయ రహదారి పైన చిలమత్తూరు వైపు వెళుతున్న కారు దినేష్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో దినేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. కారులో ఉన్నవారు మద్యం సేవించినట్లు గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేశారు. కారులో కూడా మద్యం సీసాలు ఉన్నట్లు స్థానికులు చెప్పారు. సిఐ వేణుగోపాల్, ఎస్ ఐ మునీర్ అహమ్మద్ సంఘటన స్థలానికి పరిశీలించారు. మృతుని కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వెంగళమ్మ చెరువులో నాకాబందీ

పుట్టపర్తి రూరల్ : జిల్లా ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్ ఆదేశాల మేరకు పుట్టపర్తి రూరల్ సిఐ జయ నాయక్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని వెంగళమ్మ చెరువు గ్రామంలో ఆదివారం నాకాబందీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి రూరల్ సిఐ జయ నాయక్, ఎస్ఐ బాబ్జాన్, కొత్తచెరువు ఎస్ఐ లింగన్న, పోలీసులు పాల్గొన్నారు. గ్రామంలో నాటు సారా, కర్నాటక మద్యంపై ఆరా తీశారు. పలువురి నివాసాలు, గడ్డివాములు, దుకాణాలలో తనిఖీలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి రూరల్ పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో 23 గొర్రెలు మృతి

బత్తలపల్లి : మండలంలోని యర్రాయపల్లిలో కుక్కల దాడిలో 23 గొర్రె పిల్లలు మృతిచెందాయి. గ్రామానికి చెందిన బాలగొండ శివయ్య, చిట్రా ఓబిలేసు, శివయ్య శనివారం తమ గొర్రెల మందను మేపుల కోసం సమీపంలోని కొండ మీదకు తీసుకువెళ్లారు. ఈ సమయంలో చిన్న పిల్లలను గొర్రెల గూడు కింద వదిలేసి వెళ్లారు. వారు మేపులకు వెళ్లిన తరువాత ఊరు కుక్కలు వచ్చి గూడు కింద మట్టిని త్రవ్వి గూడులోకి ప్రవేశించి అందులో ఉన్న 23 గొర్రెల పిల్లలను కొరికి చంపాయి. బాలగొండ శివయ్యకు చెందిన గొర్రె పిల్లలు 13, చిట్రా ఓబిలేసువి 5, శివయ్యవి 5 గొర్రె పిల్లలు మృతిచెందాయి. దీంతో తమకు రూ.1.20లక్ష నష్టం జరిగినట్లు బాధితులు వాపోయారు. తమను ఆదుకోవాలని వారు కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

కదిరి టౌన్ : కదిరి రూరల్ మండలం నడింపల్లి వద్ద ఐచర్ వాహనం ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు... నల్లమాడ మండలం రెడ్డిపల్లి గ్రామానికి చెందిన ముస్తఫా ఆయన భార్య సాదాది కదిరిలో ఉన్న కుమార్తెను చూడడానికి వచ్చి స్వగ్రామానికి ద్విచక్రవాహనంలో బయలుదేరారు. నడింపల్లి వద్ద వీరి వాహనాన్ని ఐచర్ వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ముస్తఫా (65) మృతిచెందాడు. ఆయన భార్య సాదాది తీవ్ర గాయాల పాలయ్యారు. దీంతో ఆమెను అనంతపురం తరలించారు. మృతుడికి ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నట్లు బంధువులు తెలిపారు.

జంగాల కాలనీలో చోరీ

గుత్తి : పట్టణంలోని జంగాల కాలనీలోని ఓ ఇంట్లో శనివారం రాత్రి చోరీ జరిగింది. కాలనీకి చెందిన ఆదినారాయణ పని నిమిత్తం శనివారం ఊరెళ్లాడు. గమనించిన గుర్తుతెలియని దుండగులు ఇంటి తలుపు తాళాలు పగలగొట్టి లోనికి ప్రవేశించారు. గదిలో ఉన్న బీరువాను బద్దలుకొట్టి అందులోని రూ.లక్ష నగదు, 2.5 తులాల బంగారు నగలు దోచుకెళ్లారు. ఆదినారాయణ ఆదివారం సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా తలుపులు తెరిచి ఉండగా అనుమానంతో బీరువాను పరిశీలించగా దాచి ఉంచిన నగదు, బంగారు నగలు కనిపించలేదు. దీంతో లబోదిబోమంటూ బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

పశుగ్రాసం దగ్ధం

బొమ్మనహాల్ : మండల కేంద్రానికి రైతు కురుబ హుసేంద్రబాబుకు చెందిన 30 ఎకరాల్లో పండిన వరి పశుగ్రాసం దగ్ధమైంది. రైతు తెలిపిన వివరాల మేరకు... దాదాపు 30 ఎకరాల్లో పండిన వరి పంట పశుగ్రాసాన్ని వాములుగా ఏర్పాటు చేసుకున్నాడు. అయితే వాములపై వెళ్లిన విద్యుత్ వైర్ల కారణంగా నిప్పు రవ్వలు చెలరేగి మంటలు చెలరేగాయి. దీంతో రూ.3లక్షల విలువజేస్తే గ్రాసం కాలిపోయింది. అయితే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో ఆలస్యంగా వచ్చారు. వారు వచ్చేలోపు గ్రాసం పూర్తిగా కాలిబూడిదైంది. దీంతో రైతు కుటుంబం కన్నీరు మున్నీరుగా విలపించింది. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నారు.

సుబ్రమణ్యేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

ఆత్మకూరు : మండల పరిధిలోని పంపనూరు గ్రామంలో వెలసిన సుబ్రమణ్యేశ్వర స్వామికి మాఘమాసం 4వ ఆదివారాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం నుంచి అర్చనలు, పాలాభిషేకం, పంచామృతాభిషేకం, బంగారు కవచసేవ, అలంకరణ, ఆకుపూజ, కుజదోష, రాహుకేతు దోష, సర్పదోష, కాలసర్పదోష నివారణకు బీజాక్షర హోమం అనంతరం రథోత్సవం, మహామంగళహారతి నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ దుబ్బ చంద్రశేఖర్‌రెడ్డి, ఆలయ పాలకమండలి సభ్యులు, ఆలయ కార్యనిర్వహణాధికారి, పంపనూరు సర్పంచి ఎర్రసామి, గ్రామపెద్దలు, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమాజంలో మానవతా విలువలు పెరగాలి

గుత్తి : ప్రస్తుత సమాజంలో మానవతా విలువలు పెరగాలని జమాతే ఇస్లామీ హింద్ మండల అధ్యక్షులు ఎం.ఫజులుల్లా కోరారు. ఆదివారం స్థానిక పట్టణంలోని రోడ్లు భవనాల శాఖ అతిథి గృహంలో జమాతే ఇస్లామి హిందూ మండల శాఖ ఆధ్వర్యంలో మానవతా- నైతికత అనే నినాదంతో జాగృతి ఉద్యమాన్ని ప్రారంభించారు. ఇందులో భాగంగా ఉద్యమానికి సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఫజులుల్లా మాట్లాడుతూ మానవతా నైతికతతోనే సత్ససమాజం సాధ్యమన్నారు. దేశంలో పెరిగిపోతున్న నేరాలు, మారణహోమాలతో సమాజం నిత్యం అశాంతి, అలజడికి గురవుతోందన్నారు. మనిషిలో నైతిక పరివర్తన కలిగినప్పుడే మానవతా విలువలు విస్తరిస్తాయన్నారు. దైవభీతి, జవాబుదారితనం వల్ల మనిషిలో అవసరమైన మానవతా, నైతికత జన్మిస్తాయన్నారు. సమాజంలో ఆ భావన పెంపొందించే ఉన్నత లక్ష్యంతో జమాతే ఇస్లాం హిందూ సంస్థ రాష్ట్రవ్యాప్తంగా మానవతా-నైతికత జాగృతి ఉద్యమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జాగృతి ఉద్యమంలో భాగంగా సామాజిక, రాజకీయ, వివిధ రంగాల ప్రముఖులతో రౌండ్ టేబుల్ సమావేశాలు, వివిధ మతాల ఆధ్యాత్మిక గురువులతో చర్చా గోష్టి, వ్యక్తిగత పరిచయాలు, కరపత్రాలు, పోస్టర్లు పంపిణీ, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ప్రజలు ఉద్యమంలో భాగస్వాములై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జమాతే ఇస్లామి హింద్ నాయకులు మౌలానా అబ్దుల్ హక్, బిఆర్. షరీఫ్, బిఆర్. మస్తాన్, మౌలానా ముస్తాక్ రషీదీ, మౌలానా రిజ్వానా రసీదీ, జఫ్రూ, అక్రమ్, అబ్దుల్ హక్ తదితరులు పాల్గొన్నారు.

మామిడి పంటపై రైతుల ఆశలు

పెద్దవడుగూరు : రెండేళ్లుగా రైతులకు నిరాశ చూపిన మామిడి పంట ఈసారి ఊరిస్తోంది. ఎందుకంటే ఈ సంవత్సరం కురిసిన భారీ వర్షాల కారణంగా మామిడి పంటలో పూత ఎక్కువగా వచ్చింది. దీంతో దిగుబడిపై కూడా రైతులు భారీగానే ఆశలు పెట్టుకున్నారు. మండలవ్యాప్తంగా కొత్తపల్లి, కాశేపల్లి, భీమునిపల్లి, గంజిగుంటపల్లి, మొలకతాళ్ల, చిత్రచేడు, గోపురాజుపల్లి, రావులుడికి, చింతలచెరువు, బుర్నాకుంట, అప్పేచెర్ల, కొండుపల్లి, వీరన్నపల్లి, వెంకటాంపల్లి, నాగలాపురం తదితర గ్రామాల్లో వెయ్యి ఎకరాల్లో మామిడి పంటను సాగుచేశారు. ఆయా గ్రామాల్లో ఏటేటా ఇదేస్థాయిలోనే మామిడి పంట సాగు చేస్తారు. అయితే దిగుబడి మాత్రం ఆశించిన స్థాయిలో రాకపోవడంతో రైతులు నష్టాలబాటలో నడస్తూనే ఉంటారు. గతరెండేళ్లలో ఆకాల వర్షాలు, గాలుల బీభత్సానికి పంట నెలరాలిపోయి అపారమైన నష్టాలు సంభవించాయి. దీంతో రైతులు తీవ్ర నిరాశలో ఉన్నారు. కాగా ఈసారి మామిడి పంట పూత దశలో ఉంది. పూత కూడా అనుకున్న స్థాయిలోనే ఉంది. ఈనేపథ్యంలో కనీసం ఈసారైనా మామిడిపంటలో ఆశించిన స్థాయిలో దిగుబడులు వస్తాయనే రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఎర్రవంకలో పూడికతీత పనులు

ఉరవకొండ : మండలంలోని మండలం రేణుమాకులపల్లి గ్రామంలో ఆంజనేయ స్వామి దేవాలయ సమీపంలో ఉన్న ఎర్రవంకలో ఆదివారం పూడికతీత పనులు చేపట్టారు. ఎర్రవంక పూడికతో నిండి దుర్వాసన వెదజలడమే కాకుండా ప్రజలు అనారోగ్యానికి గురవుతుండడంతో స్పందించిన సర్పంచి బోయ రామాంజనేయులు తన సొంత నిధులతో రెండు రోజులుగా జెసిబితో పూడికను తొలగించారు.